క్లుప్తంగా

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల రథోత్సవం



శివలింగానికి పూజలు చేస్తున్న నేతలు

షాద్‌నగర్: మండల పరిధిలోని రామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం దేవాలయంలో పార్వతీ పరమేశ్వరుల రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయం నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న బాలకృష్ణగౌడ్

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన బాలకృష్ణగౌడ్ సోమవారం రూ.51వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా విరాళాన్ని దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్‌గుప్త, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



పునర్నిర్మించిన మైసమ్మ దేవాలయం

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్‌లో పునర్నిర్మాణం చేపట్టిన కట్టమైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ గడ్డం లావణ్య, ఆలయ కమిటీ సభ్యులు నర్సింహ్మారెడ్డి, మల్లేష్‌గౌడ్ తెలిపారు. 21న జీర్ణోద్ధారణ, వాస్తుబలి, వాస్తుహోమంతో ప్రారంభమై 25న బోనాల ఉత్సవాలతో పూర్తవుతాయి.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

టీవీవీ ఆవేదన

షాద్‌నగర్‌టౌన్: మెదక్ పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురై మరణించిన మహ్మద్ ఖదీర్‌ఖాన్ మృతిపై ప్రభుత్వం హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. దొంగతనం చేశాడనే అనుమానంతో ఖదీర్‌ఖాన్‌ను పోలీసులు అకారణంగా చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. చేయని దొంగతనం నేరాన్ని బలవంతంగా ఒప్పించాలని పోలీసులు దారుణానికి ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ ఉందని చెబుతున్న ప్రభుత్వం మెదక్‌లో జరిగిన ఘటనతో ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం కొనసాగుతుందని, ఖదీర్ మృతికి కారకులైన వారిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షల పరిహారం, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: దేశంలో నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని ప్రజలకు చేరేలా అవగాహన కల్పించాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ గ్రామంలో గ్రామ బీజేపీ అధ్యక్షుడు తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు బంటు జ్ఞానేశ్వర్, వినయ్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ కార్నర్ సమావేశంలో విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు వివరించాలని సూచించారు. సీఎం కేసీఆర్ 8 సంవత్సరాల నుంచి ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని మండిపడ్డారు. రాష్ట్రంలో, దేశంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జోష్యం చెప్పారు.

యమపాశాలుగా విద్యుత్ వైర్లు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. సకాలంలో స్పందించకపోవడంతో విద్యుత్ వైర్లు యమపాశాలుగా మారి రైతులు, మూగజీవాల ప్రాణాలు హరిస్తున్నాయి. పొలాల్లో ఒరిగిన స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని రైతులు పొలాల్లో తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

- కిందకు వేలాడుతున్న కరెంట్ తీగలు
- ఇబ్బందులో రైతులు, జీవాల కాపరులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



రేగడిదోస్వాడలో పొలం మధ్యలో ఒరిగిన స్తంభం కర్రతో సరిచేసిన రైతులు



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పాడి గేదెలు

షాబాద్: పంట సాగు చేస్తున్న రైతులకు కరెంట్ తప్పనిసరి. వ్యవసాయంలో భాగంగా బోరుబావుల వద్ద పొలాలకు నీరు పెట్టాలంటే కరెంటు ముఖ్యం. ఈ క్రమంలో పొలాల్లో అక్కడక్కడ విద్యుత్ సరఫరా చేసే స్తంభాలు ఒరిగిపోయాయి. దీంతో రైతులు ఆ దారిగుండా వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. పశువుల కాపరులు కూడా వేలాడుతున్న తీగలగుండా వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పోవాల్సి వస్తుంది. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేగడిదోస్వాడ, మక్తగూడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ, తాళ్లపల్లి, నాగర్‌గూడ, మాచన్‌పల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ తీగలు సరిగ్గా లేవు. రైతుల పాలిట యమపాశాలుగా మారినా ఈ తీగలను సరిచేయడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని వారు చెబుతున్నారు. విద్యుత్ అధికారులకు బిల్లుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ సమస్యలను పరిష్కరించడంలో లేదని రైతులు విమర్శిస్తున్నారు. వంగిన స్తంభాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రైతులు కర్రలనాటి తీగలను సరి చేసుకుంటున్నారు. రేగడిదోస్వాడలో స్తంభాలకు రెండు లైన్లు ఏర్పాటు చేశారు. ఒక లైను వైర్లు వేలాడడంతో తాత్కాలికంగా కర్రలను ఏర్పాటు చేసుకొని సరిచేసుకుంటున్నారు. మక్తగూడ, బొబ్బిలిగామ, తాళ్లపల్లి గ్రామాల్లో ఒంగిన విద్యుత్తు స్తంభాలను నేటికి సరి చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వాపోతున్నారు. రాత్రి వేళలో రైతులు పంట పొలాలకు వెళ్లలంటే ప్రమాదం ఏ విధంగా సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పంటల సాగు సమయంలో ఒంగిన స్తంభాలతో ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి వెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాబాద్‌లో విద్యుత్ తీగలు కిందికి వేలాడడంతో షాక్ తగిలి పాడి గేదెలు మృతి చెందాయి. అయినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

తీగలు సరి చేయాలి...



రేగడిదోస్వాడ, రేగడిదోస్వాడ గ్రామాల్లో పంటపొలాల్లో కరెంట్ తీగలు వేలాడుతున్నాయి. దీంతో రైతులు పలు రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకుని తీగలు సరి చేయాలని కోరుతున్నారు.
–రాజశేఖర్‌రెడ్డి, రైతు లక్ష్మరావుగూడ

కర్రలతో సరి చేసుకున్నాం...



నాగర్‌గూడలో గ్రామంలో పొలల్లో విద్యుత్తు తీగలు వేలాడడంతో కర్రలను ఏర్పాటు చేసుకుని సరి చేసుకున్నాం. పొలంలో పనులు చేసుకునే సమయంలో భయంగా ఉంటుంది. –ముక్తర్, రైతు నాగర్‌గూడ

సమస్యను పరిష్కరిస్తాం...

వర్షాకాలంలో వీచిన బలమైన గాలులకు స్తంభాలు వంగిపోయాయి. దీంతో తీగలు వేలాడి ఉండొచ్చు. తక్షణమే సమస్యను గుర్తించి పరిష్కరిస్తాం.
–నరేందర్, ఏఈ, షాబాద్

ఆరోగ్య పరిరక్షణ కోసమే ఆయుష్మాన్ భారత్

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: పేదల ఆరోగ్య పరిరక్షణ కోసమే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టిందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన ఆయుష్మాన్ భారత్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన వారికి ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ప్రతి నిరుపేద కుటుంబానికి ఐదు లక్షల బీమా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు వారికి ఉచిత వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. సీఎం కేసీఆర్ నియంతృత్వపోకడలతో రాష్ట్రంలో ఈ పథకాన్ని ఆలస్యంగా ప్రారంభించారని అన్నారు. అర్హులైన వారు మీసేవా, సీఎస్‌సీ కేంద్రాల్లో ఈ పథకానికి దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అందెబాబయ్య, శంకర్ నాయక్, వెంకటేష్, కుర్మయ్య, యాదయ్య, లక్ష్మయ్య, విష్ణు, శంకర్, లింగం నాయక్, ప్రశాంత్‌రెడ్డి, ముకుందం గౌడ్, ప్రవీణ్, జగన్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

రేపు మంత్రి కేటీఆర్ రాక



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అవినాశ్‌రెడ్డి, తదితరులు

షాబాద్: ఈ నెల 22న మండలంలోని హైతాబాద్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలం హైతాబాద్‌లో సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ..ఈ నెల 22న (బుధవారం) మంత్రి కేటీఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చందనవెల్లిలోని వెల్‌స్పన్ కంపెనీలో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన నిర్వహించే ప్రారంభోత్సవంలో ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూర్ నర్సింగ్‌రావు, జిల్లా రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి, మండల రైతు కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు శ్రీనివాస్‌గౌడ్, స్వప్న నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు మల్లేష్, శేఖర్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, మాజీ సర్పంచ్ దర్శన్, మాజీ డైరెక్టర్ సుధా యాదయ్య, నాయకులు తదితరులున్నారు.

సబ్సిడీ ఇవ్వరు.. రుణమాఫీ చేయరు

- రైతు బాధలు పట్టని బీఆర్ఎస్ ప్రభుత్వం
- హాత్‌సే హాత్ జోడో లో శంకర్



పొలంలో ఎరువులు వేస్తూ రైతుకు సాయం చేస్తున్న శంకర్

షాద్‌నగర్‌రూరల్: రైతులకు సబ్సిడీ ఇవ్వలేదు.. రుణమాఫీ చేయలేదు...ఎరువుల ధరలు పెరిగిపోతున్నాయి.. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదు..రాష్ట్రంలో రైతుల బతుకులు ఆగమైపోతున్నాయని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లిశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి, కిషన్‌నగర్, విఠ్యాల గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అశన్నగౌడ్ ఆధ్వర్యంలో హాత్‌సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేపట్టిన శంకర్ రైతులతో మమేకమై పొలం పనుల్లో సాయం చేశారు. రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ దుర్మార్గపు పాలన చేస్తుంటే రాష్ట్రంలో బీఆర్ఎస్ రాక్షస పాలన చేస్తుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రం ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వడం లేదని, రుణమాఫీ చేయడం లేదని మండిపడ్డారు. అదేవిధంగా కేంద్రం ఇష్టానుసారంగా గ్యాస్, ఎరువుల ధరలను పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు 2లక్షల రుణమాఫీ, సబ్సిడీ ఇవ్వడంతో పాటుగా ఎకరానికి 10వేలు పెట్టుబడి సాయం, ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు, స్థలం ఉన్న వారికి కట్టుకునేందుకు రూ.5లక్షలను అందజేయడం, గ్యాస్ ధరలను తగ్గిస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కిసాన్ కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు

షాబాద్: నరెడ్లగూడ గ్రామ అభివృద్ధికి రూ.1 కోటి 10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నరెడ్లగూడ గ్రామస్తులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ నిధులతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నరెడ్లగూడను సమస్యలు లేని గ్రామంగా మారుస్తామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాంరెడ్డి, నర్సింహారెడ్డి, గ్రామస్తులు ముక్క విశ్వంమాదిగ, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, రాములు, చందు, రవి, యాదయ్య, శంకరయ్య తదితరులున్నారు.

కంటివెలుగుపై అవగాహన తప్పనిసరి

హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు



శిబిరాన్ని పరిశీలిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు

షాద్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని సోమవారం హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలతో ఎవరు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరు కంటి వెలుగు శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్తలు వార్డు పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కంటి సమస్యలతో బాధపడే వారిని గుర్తించి వైద్య శిబిరానికి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని చెప్పారు. ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి, హెల్త్ సూపర్ వైజర్ అమృత, తుకారం, అశ్విని, భారతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి సహకరిస్తాం

ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం

చేవెళ్ల: మండలకేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కెఎస్‌రత్నంలు అన్నారు. మండలకేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న శివరాత్రి జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేర్వేరుగా అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కెఎస్ రత్నం మాట్లాడుతూ.. ప్రతి ఏడాది శివరాత్రి జాతర ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తుండడంతో పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు ఇక్కడికి తరలివస్తున్నారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం. వెంకటేశంగుప్తా, ఎం. యాదగిరి, మద్దల జంగయ్య, నర్సింలు, రాచంద్రయ్య, మానిక్యరెడ్డి, శివానందం, మానిక్యం, దయాకర్‌రెడ్డి, నాగారాజు, ప్రభు, తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న శశిధర్‌రెడ్డి

శంకర్‌పల్లి: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు పేర్కొన్నారు. శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని అరుణోదయ యువజన సంఘం ఆవరణలో విభూది హేష్ స్మారకార్థం ఆదివారం రాత్రి నిర్వహించిన బాడ్మింటన్, డబుల్ వికెట్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. బాడ్మింటన్ మొదటి బహుమతి మహేష్, చరణ్, ద్వితీయ బహుమతి మల్లేష్, కృష్ణలు అందుకున్నారు. డబుల్ వికెట్ క్రికెట్ మొదటి బహుమతి తుషార్, సంజు, రెండవ బహుమతి టిల్లు, బబ్బీ అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువకులు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రకాష్‌గుప్త, నాయకులు బాలక్రిష్ణ, ప్రణిత్ కుమార్, చిన్న, శ్రీధర్, రంపాల్, నాగభూషన్, వెంకటేష్, నాగరాజు, అలీ, సంజిత్ కుమార్, రాంచందర్, ప్రేమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా దోపోత్సవం

- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- ఆకట్టుకున్న చెంచుల ఆటపాటలు
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కాలెయాదయ్య



దోపోత్సవంలో స్వామివారి ఊరేగింపు

చేవెళ్ల: మండలకేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న శివరాత్రి జతర బ్రహ్మోత్సవాలు ఆదివారం అర్ధరాత్రి కనుల పండువగా దోపోత్సవం నిర్వహించారు. ఆలయ సమీపంలోని పుష్కరిణి వద్ద నిర్వహించిన ఈ దోపోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం దోపోత్సవం

దోపోత్సవంలో భాగంగా వేంకటేశ్వరస్వామిని, అలివేలు మంగమ్మను వేర్వేరుగా ఆలయం నుంచి ప్రధాన చౌరస్తాల గుండా ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. పుష్కరిణి వద్ద భక్త జనసందోహం మధ్య దోపోత్సవాన్ని నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి నుంచి చెంచులు అభరణాలు దొంగలించి అలివేలు మంగమ్మకు అందించే ఈ కార్యక్రమాన్ని చెంచులు (చెంచు జాతీ వారు) ఆటపాటలతో నిర్వహించారు. డప్పుల చప్పులుతో, బ్యాండుమేళాలతో ఉత్సాహంగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఆభరణాలు దోచుకోవడం పూర్తయిన తరువాత వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మలను ఒకటి చేసి ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఈ దోపోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈఓ. శ్రీనివాస్‌లు, పూజారులు శ్రీపాదు, శ్రీకాంత్, వామానాచార్యులు, వాసు, కన్న, ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, సర్పంచ్ బండారి శైలజ ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ గంగి యాదయ్య, వార్డు సభ్యులు టేకులపల్లి శ్రీను, సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, పూజాలరు, భక్తులు పాల్గొన్నారు. దోపోత్సవానికి వచ్చే భక్తులకోసం గ్రామ పెద్దలు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ప్రొద్దుటూరు ఎల్లారెడ్డిచే భక్తి ప్రవచనాల కార్యక్రమాలు నిర్వహించారు.

దోపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే..

వేంకటేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగే దోపోత్సవంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. నవాబుపేట, శంకర్‌పల్లి మండలాల నాయకులతో కలిసి ఆయన ఈ దోపోత్సవంలో పాల్గొని తిలకించారు.

గట్టి పోలీస్ బందోబస్తు



దోపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

దోపోత్సవానికి పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. చేవెళ్ల సీఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సీఐ వాసు, ఎస్ఐ చందర్‌నాయక్‌ల ఆధ్వర్యంలో సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. రోడ్లుపై పెట్రోలింగ్ వాహనాలతో రోడ్డు క్లీయర్ చేశారు.

24 నుంచి జిల్లాస్థాయి క్రీడాపోటీలు

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి



స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, తదితరులు

షాబాద్: ఈనెల 24 నుంచి షాబాద్‌లో జిల్లాస్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో క్రీడాపోటీలకు పార్టీ నాయకులతో కలిసి అవినాశ్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి పేరుపై షాబాద్‌లో రూ.50లక్షలతో మినీస్టేడియం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టేడియంలో క్రీడాకారులకు అన్ని రకాల వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి రాజేందర్‌రెడ్డి స్మారకార్థం జిల్లాస్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయి క్రికెట్ పోటీల మొదటి బహుమతిగా రూ. లక్ష రూపాయలు, ద్వితీయ బముమతిగా రూ. 75 వేలు అందిస్తామన్నారు. వాలీబాల్ పోటీలు మొదటి బహుమతి రూ. 25వేలు, ద్వితీయ బహుమతి రూ. 15వేలు అందజేస్తామన్నారు. ఎంట్రీలు, పూర్తి వివరాలకు 9949086569, 9849111018, 9849711579 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, పీఆర్ఆర్ యూత్ అధ్యక్షుడు జడల రాజేందర్‌గౌడ్, రమేష్‌యాదవ్, స్టేడియం అభివృద్ధి కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు వెంకటయ్య, సుదర్శన్, ముత్యం, విశ్వనాథం, లక్ష్మణ్, చందు, రవి, రాములు, తదితరులున్నారు.

పంచలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొందుర్గు: మండల కేంద్రంలోని పంచలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవార్చుకోవాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బుచ్చిలింగం, వజ్రలింగం, ప్రభులింగం, బస్వరాజ్, కిశోర్, శ్రీశైలం, శ్రీనివాసుగుప్త, వీరన్న, రాజు, ప్రభు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.